ప్రజాశక్తి
మంగళవారం 6 జూన్ 2023
5
విజయనగరం



బాక్సింగ్ జట్లు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాస్థాయి జూనియర్స్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు బాల బాలికల జిల్లా జట్టు ఎంపిక పూర్తయ్యింది. స్థానిక రాజీవ్ స్టేడియంలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలురు 13 విభాగాల్లో 13 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9 నుండి 11 వరకు విజయవాడ లో జరుగు రాష్ట్రస్థాయి జూనియర్స్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డోల మన్మధకుమార్, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్ఇ రాజు, డి.మురళి తదితరులు పాల్గొన్నారు.

వైకెపి కార్యాలయం

మహిళా మార్టు పేరిట భారీగా వసూళ్లు

జిల్లాలో మహిళా మార్టులు ఏర్పాటు పేరిట పొదుపు మహిళల నుంచి వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారులు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రతి మండలంలోనూ మహిళా మార్టు ఏర్పాటు చేసి, ఆ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయాన్ని మహిళలందరికీ సమకూరుస్తామని చెబుతున్నారు. మహిళలకు ఇష్టం ఉన్నా లేకున్నా బలవంతంగా డబ్బులు వసూలు చేయడం పట్ల మహిళలంతా వ్యతిరేకిస్తున్నారు.

డబ్బులు ఇవ్వాల్సిందేనని ఆదేశాలు

ప్రజాశక్తి-గుర్ల

గుర్ల మండలంలో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తామంటూ గ్రామాల్లో గ్రామైక్య సంఘం అధ్యక్షులు, విఒఎలు కలిసి ఎస్‌హెచ్ జి సభ్యుల నుంచి రూ.310 చొప్పున వసూలు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. మండలం మొత్తం 18వేల మంది మహిళ సంఘం సభ్యుల నుంచి రూ. 56 లక్షలు వసూలు చేసి మండల కేంద్రంలో మహిళా మార్ట్ ఏర్పాటు చేస్తామంటున్నారు. విఒఎ లు, విఒ అధ్యక్షులు, వైఎస్ఆర్ క్రాంతి పథం అధికారులు, గ్రామాల లో కనీసం అవగాహన సమావేశాలు గాని నిర్వహించ కుండా సభ్యుల నుంచి డబ్బులు వసలుకు రంగం సిద్ధం చేశారు. డబ్బులు ఎందుకు ఇవ్వాలని, తమకు ఉపయోగమేమిటి అని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో విఒఎలు, విఒ అధ్యక్షులు గ్రూప్ లీడర్లను బ్యాంకులకు తీసుకెళ్లి ఆసరా డబ్బులు డ్రా చేస్తామని చెబుతూ, పొదుపు ఖాతా నుంచి డబ్బులు విత్ డ్రా చేస్తున్నారని కొంతమంది సభ్యులు ఆరోపిస్తున్నారు. సభ్యుల పెట్టుబడితో మండలంలో వ్యాపారం చేస్తారా అంటూ మరికొంతమంది మహిళలు ప్రశ్నిస్తున్నారు.

మహిళా సంఘాల సభ్యులతో కనీసం సమావేశాలు ఏర్పాటు చేయకుండా ,మహిళ మార్ట్ ఏర్పాటు ఉద్దేశం, లక్ష్యాన్ని సభ్యులకు తెలియజేయకుండా వసూలు చేయడం సరికాదనే వాదనలు వినిపిస్తున్నాయి. సభ్యుల నుంచి వసూలు మొత్తం డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్తాయి? వాటికి బాధ్యులు ఎవరనే దాని పై గ్రామాల్లో చర్చ జరుగుతోంది. ఒక చేతితో ఆసరా డబ్బులు అందిస్తున్నామని చెబుతూ మరోవైపు ఇలా బలవంతపు వసూళ్లు ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. మహిళా మార్ట్ పెట్టి ఏం వ్యాపారం చేస్తారో సభ్యులకు తెలీదు. లాభం వస్తుందా,నష్టం వస్తుందా తెలీదు. ప్రభుత్వ సహకారం తో ఏర్పాటు చేయాల్సిన మార్ట్‌లను సంఘం సభ్యులతో ఏర్పాటు చేయడం ఏమిటని మరికొంత మంది అంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత సిసిలు గాని, ఎపిఎం గాని గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించక పోవడం గమనార్హం.

ఎపిఎం వివరణ

మండలంలో మహిళా మార్ట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. ప్రతి సభ్యురాలు నుంచి రూ. 310 వసూలు చేయాలని నిర్ణయించాం. ఇందులో ఎటువంటి బలవంతమూ లేదు. సభ్యులు ఇష్టపూర్వకంగా ఇవ్వాలి. సభ్యులకు తెలియ కుండా పొదుపు ఖాతా నుంచి విత్ డ్రా చేయకూడదు. తొంభై శాతం వసూలైతేనే మార్ట్ ఏర్పాటు చేస్తాం. దీనికి ఒక కమిటీ ఏర్పాటు చేసి వారి ద్వారా లావాదేవీలు జరుగుతాయి.

అగ్రహారం భూముల వ్యవహారం ఆద్యంతం అయోమయంగానే ఉంది. తొలుత అగ్రహారం భూములకు మోక్షం కలిగిందని అంతా భావించారు. తరాలుగా సాగుచేస్తున్న భూములకు హక్కులు సిద్ధిస్తాయని ఆనంద పడ్డారు. కానీ నోటిఫికేషన్ విడుదలైన తర్వాత అందులో పొందిపర్చిన అంశాలు లోపభూయిష్టంగా ఉన్నాయన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. తమ సాగులో ఉన్న భూమిని ఇనాందారుని పేరున 1/3 కేటాయించడం పట్ల కలకలం రేగుతోంది. తాతలు, తండ్రుల నుంచి కానరాని ఇనాందారుకు వాటా ఎలా ఇస్తారన్న ప్రశ్నలతోపాటు నోటిఫికేషన్‌లోని అనేక అంశాలు గందరగోళాన్ని తలపిస్తున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

జామి అగ్రహారం భూములు

అగ్రహారం అయోమయం!

- పబ్లిక్ నోటిఫికేషన్ పై గందరగోళం
- ఇనాం 1/3 కేటాయింపుపై కలకలం
- తాతల కాలం నుంచి కానరాని ఇనాందారు
- ఆందోళనలో రైతులు
- అభ్యంతరాల గడువు పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి - జామి

జామి మండల కేంద్రంలో సుమారుగా 2600 ఎకరాల వరకు ఇనాం (అగ్రహారం) భూములు ఉన్నాయి. వీటికి హక్కులు కల్పించాలని రైతులు దశాబ్దాలుగా కోరుతున్నారు. 2009లో భూ సర్వే ప్రారంభమై, ఎట్టకేలకు గత నెల 25న తహశీల్దార్ నోటిఫికేషన్ విడుదల చేశారు. 30 రోజుల్లో నోటీసులో పొందుపర్చిన వివరాలపై అభ్యంతరాలు తెలపాలని పేర్కొన్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా... రైతులకు అంతుపట్టని పలు అంశాలు నోటిఫికేషన్‌లో రావడంతో గందరగోళానికి గురవుతున్నారు. ప్రధానంగా నోటిఫికేషన్‌లో ఇనాం దారుని పేరు రాయకుండానే ఇనాం వాటా కింద 1/3 భూమిని కేటాయించడం గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఇనాం అండ్ ఎస్టేట్ ఎనాలిసిస్ యాక్ట్ ప్రకారం, సాగుదారునికి 2/3, ఇనాందారునికి 1/3 వాటా భూమి కేటాయించడం న్యాయమే. కానీ తాతలు, తండ్రుల కాలం నుంచి కానరాని ఇనాందారుడి పేరుతో భూ కేటాయింపు చేయడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఒకవేళ ఇనాందారుడు పేరు రికార్డుల్లో ఉంటే, పబ్లిక్ నోటిఫికేషన్‌లో ఎందుకు పొందు పరచలేదనే వాదన లేకపోలేదు. మొత్తం అగ్రహారం భూమిలో కేవలం 2049 ఎకరాలకు మాత్రమే వేయడం, మిగులు భూముల వివరాలు, వాటి పరిస్థితిని ఎందుకు నోటిఫికేషన్‌లో పెట్టలేదన్న ప్రశ్న వినిపిస్తోంది.

కొంతమంది ఇనాందారుల నుంచి కొనుక్కొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అటువంటి రైతుల రికార్డుల గురించి నోటిఫికేషన్‌లో ఎటువంటి సమాచారమూ లేదు. కొంత మందికి తహశీల్దార్ కార్యాలయం నుంచి 300కు పైగా పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. వాటి సంగతి ఏమిటన్నది తెలియజేయలేదు. వీటన్నిటికీ మించి గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణలో నష్టపోయిన రైతులకు నెల రోజుల్లో న్యాయం చేస్తామని, పాసుపుస్తకాలు మంజూరు చేస్తామని ఆర్‌డిఒ సైతం గ్రామసభలు పెట్టి ప్రకటించారు. కానీ వారికి కూడా ఇనాం వాటా వేసి, నోటిఫికేషన్‌లో చూపించారు. కొన్ని ఖాతాల పేర్లు తప్పులు పడగా, కొంతమంది భూమి విస్తీర్ణం తప్పుల తడకగా నమోదైంది. ఇన్ని అభ్యంతరాలు ఉన్నప్పటికీ వీటికి కేవలం నెల రోజులు మాత్రమే గడువు ఇచ్చారు. ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలై రెండు వారాలు గడుస్తున్న నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గడువు పెంచడంతోపాటు రైతులకు సరైన అవగాహన కలిగించే విధంగా సదస్సులు పెట్టాలని కోరుతున్నారు. ఒక్క నోటీసు ఇచ్చి వదిలేసి సరిచేయలేని విధంగా రికార్డులు ఉన్న తరుణంలో నోటిఫికేషన్ వేసిన ఫలితం ఏముందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా నోటిఫికేషన్ సరిచేసే విధంగా, రైతులకు అవగాహన కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లేని ఇనాంకు నా భూమి ఇస్తారా?

మా తాతలు, తండ్రుల నుంచి 2 ఎకరాలు భూమిని సాగు చేస్తున్నాం. కాని అధికారులు ఇనాం వాటా కింద 1/3 భూమిని కేటాయించారు. ఇన్నాళ్లు కనిపించని ఇనాం ఎక్కడి నుంచి వచ్చారు. ఒకవేళ రికార్డుల్లో ఇనాం ఉంటే, నోటిఫికేషన్‌లో ఎందుకు చూపలేదు. నోటిఫికేషన్‌లో సర్వే నంబర్‌తోపాటు భూ విస్తీర్ణం, పేర్లు తప్పులుగా నమోదయ్యాయి. ప్రతి రైతూ లిఖిత పూర్వక అభ్యంతరం తెలపాలి. కాబట్టి ఇచ్చిన గడువు పెంచాలి.

- ఆదిరెడ్డి సూర్యనారాయణ, జామి అగ్రహారం రైతు

ప్రతి రైతును కలిసి సమస్య పరిష్కరిస్తాం

నోటిఫికేషన్‌లో నెల రోజుల్లో అభ్యంతరాలు తెలపాలని చెప్పాం. కానీ ప్రతి రైతు అభ్యంతరాన్ని పరిగణలోకి తీసుకుంటాం. ఇనాందారునికి వాటా కేటాయించాలి. అలాగని ఆయన పేరు రాయడం వల్ల లేని వారికి చట్టబద్ధత కల్పించినట్లు అవుతోంది. అందుకే పేరు పొందుపరచలేదు. ఇప్పటికే అనేక అభ్యంతరాలు వస్తున్నాయి. రైతులను నేరుగా కలిసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేస్తాం. రైతులకు న్యాయం చేస్తాం.

- జి.హేమంత్‌కుమార్, తహశీల్దార్ జామి

కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

రైలు ప్రమాద మృతులకు నివాళి

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి : ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంలో వందల సంఖ్యలో మరణించడానికి కారణం రైల్వే వ్యవస్థను ప్రైవేటీకరణ చేయడమే ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం విజయనగరం రైల్వే స్టేషన్ వద్ద మృతులకు శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు తమ్మినేని సూర్యనారాయణ ,రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదం దారుణమని, ఈ ప్రమాదంలో మరణించిన వారికి మా ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రైల్వే వ్యవస్థను పట్టించుకోక పోవడం వల్లే ఈ ఘటన జరిగిందన్నారు. సిగ్నల్ వ్యవస్థను పట్టించుకోక పోవడమే ఇంత పెద్ద ప్రమాదానికి కారణమని అన్నారు. మోడీ ప్రభుత్వం పూర్తిగా రైల్వే వ్యవస్థను ప్రైవేటీకరణ చేయడమే లక్ష్యంగా నాణ్యతను, ట్రాక్ పనులను పట్టించుకోక పోవడం వల్లే ఈ ప్రమాదానికి కారణమని అన్నారు. వందే భారత్ రైళ్ల ప్రారంభం కోసం చేసిన హంగామా రైల్వే ట్రాక్‌ల పనులు, నాణ్యమైన పనులపైనా దృష్టి పెట్టడం లేదన్నారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియో ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు ఎం.శ్రీనివాస, పి.రమణమ్మ, బి.సుధారాణి, ఎ.జగన్మోహన్, అర్.ఆనంద్, హరీష్, ప్రసాదరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొబ్బిలి : రైలు ప్రమాదంలో మరణించిన మతులకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. రైల్వే ప్రైవేటీకరణ వల్లే రైలు ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. రైల్వే ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, సిపిఐ నాయకులు ఎం.శ్రీనివాస్, సిపిఎం నాయకులు ఎస్.గోపాలం, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి యువతే బలం

ఆపద సమయంలో రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం : డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దేశానికి వెన్నెముక, బలం యువతే అని, నేడు భారతదేశ పునాదులు వారిపైనే ఉన్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. ఆపద సమయంలో ప్రజలను ఆదుకునేందుకు తామున్నామంటూ వారు ముందుకు వస్తుండటం అభినందనీయ మన్నారు. ఒడిశాలో జరిగిన రైలు ప్రమాద దుర్ఘటనలో మరణించిన వారికి నివాళిగా క్షతగాత్రులకు అవసరమైన రక్తం అందించేందుకు ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్, న్యూ విజయనగరం యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన.. లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తో కలిసి జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత రైలు దుర్ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ.. రక్తదాతలను అభినందించారు. ఒడిశా రైలు ప్రమాదం దుర దృష్టకరమని, తీరని వేదన మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న నిర్వాహకుల సేవలను ప్రశంసించారు. లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం యువత ఎంత బాధ్యతగా ఉందో చెప్పడానికి ఇదొక నిదర్శనమని కొనియాడారు. అనంతరం నిర్వాహకులను ముఖ్య అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు, కార్పొరేటర్ జివి రంగారావు, రక్తదాన శిబిర నిర్వాహకులు అనిల్, నాగేశ్వర్, శివ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


డిపిటిఒ అప్పలనారాయణను అభినందిస్తున్న ఎన్ఎంయు నాయకులు

బాధ్యతలు స్వీకరించిన డిపిటిఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ఎపియస్ ఆర్టీసీ ప్రజారవాణా అధికారిగా అప్పలనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అప్పలనారాయణను ఎన్ఎంయు నాయకులు కలిసి అభినందించారు. శాలువా కప్పి, పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డిపిటిఒ మాట్లాడుతూ యాజమాన్యానికి, ఉద్యోగులకు మధ్య వారిదిగా ఉంటూ ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విజయనగరం జిల్లాను రవాణా పథంలో ముందు తీసుకువెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు జిల్లా అధ్యక్షులు పిజి రాఫెల్ మాట్లాడుతూ మంచి వాతావరణం లో ఉద్యోగాలు చేసుకునే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కె.సత్యం, సిహెచ్ దుర్గరాజు, కెవిఆర్ రాజు, ఎమ్మెస్ రాజు, చంద్రమౌళి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఢిల్లీలో అండర్-19 ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఢిల్లీ వేదికగా మంగళవారం నుంచి జరగనున్న జాతీయ స్థాయి అండర్ 19 ఖోఖో పోటీల్లో జిల్లా నుంచి ఏడుగురు క్రీడాకారులు రాష్ట్రం తరుపున పాల్గొని సత్తా చాటనున్నారు. ఇటీవల విజయనగరం కస్పా హైస్కూలు వేదికగా అండర్ 19 ఖోఖో రాష్ట్ర పోటీలు జరిగిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో విజయనగరం బాల, బాలికలు జట్లు రాష్ట్ర విజేతలుగా నిలిచారు. ఢిల్లీలో జరిగే జాతీయ పోటీలకు పాల్గొనే రాష్ట్ర జట్టులో జిల్లానుంచి బాగా ఆడిన నలుగురు బాలికలకు, ముగ్గురు బాలురుకు రాష్ట్ర జట్టులో స్థానం కల్పించారు. జాతీయ స్థాయిలో పాల్గొనే వారిలో అలమండ ఆదిలక్ష్మి, దాసరి వైకుంఠం, చందకప్రసన్న (గరుగుబిల్లి), కె.దేవి (గరివిడి మండలం తోంద్రంగి), సిహెచ్ భవాని (గుర్ల మండలం నాగళ్లవలస), షేక్ షబీర్, పి.ప్రదీప్ (విజయనగరం)ఉన్నారు. వీరంతా ఇప్పటికే ఢిల్లీ చేరుకున్నారు. రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ జిల్లా ప్రతిష్టను జాతీయస్థాయిలో చాటి చెబుతామని క్రీడాకారులు తెలిపారు.

జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ఏడుగురు ఎంపిక

డిప్యూటీ డిఇఒగా బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి డిప్యూటీ డిఇఒగా బ్రహ్మాజీరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బొబ్బిలిలో ఇప్పటి వరకు డిప్యూటీ డిఇఒగా విజయనగరం డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.తిరుపతినాయుడు బాధ్యతలు నిర్వహించారు. జిల్లాల పునర్విభజన అవ్వకముందు బొబ్బిలిలో డిప్యూటీ డిఇఒగా బ్రహ్మాజీరావు పని చేశారు. నాడు-నేడు పనులపై పరిశీలన చేసి పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని బ్రహ్మాజీరావు తెలిపారు.

బ్రహ్మాజీరావు

9న చీపురుపల్లిలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-చీపురుపల్లి

ఈనెల 9న చీపురుపల్లిలో మెగాజాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యవతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, ఎస్‌డిసిలు సూర్యనారాయణ, సుదర్శనదొర, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్ మేళా వివరాలు

చీపురుపల్లిలోని లావేరు రోడ్డులో ఉన్న జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఉదయం 9 గంటలకు మెగా జాబ్ మేళా ప్రారంభం అవుతుంది. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే యవతీ యువకులు ముందుగానే తమ పేర్లను రిజిష్టర్ చేసుకోవాలి. వయసు 18-35 ఏళ్ల మధ్య ఉండి, తగిన విద్యార్హతలు కలిగినవారు, తమ రెజ్యూమ్, సర్టిఫికేట్లు, జెరాక్స్ కాపీలు, ఫొటోలు,ఇతర పత్రాలు తీసుకొని మేళాకు హాజరు కావాలి. ఎస్-ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ, బి.టెక్ విద్యార్హతలు ఉండాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్లు శ్రీను, స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ 9010023033, వంశీ, స్కిల్‌హబ్ కో-ఆర్డినేటర్ 7286042743, భాస్కర్, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ 9000102013, ఎపిఎస్ఎస్‌డిసి హెల్ప్‌లైన్ 9988853335 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని కోరుతూ కార్మికులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. పారిశుధ్య కార్మికులకు న్యాయమైన కోర్కెలను పరిష్కరించకుండా పాలకులు, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మండిపడ్డారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగడుగుల కామేష్, నాయకులు కళ్యాణ్ శ్రీను, దసమంతుల గణేష్, కోడూరు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలి

గ్రామాల్లో రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలి ● కలెక్టరేట్ ఎదుట పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు, కార్మికులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గ్రామాలను పరిశుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులు, గ్రీన్ అంబాసిడర్ల సంఘం నాయకులు ఎం.రమణ, బి.సూర్యనారాయణ, వి.లక్ష్మి మాట్లాడారు. 9నెలలుగా జీతాలు రాకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జీతాలు చెల్లించక పోయినప్పటికీ శ్రమపడి పనిచేస్తున్న కార్మికులను గ్రామాల్లో పెత్తందారులు తన ఇష్టానుసారంగా దుర్భాషలాడి వేధించడం సరైనది కాదన్నారు. ముఖ్యంగా గొడ్డుపాలెం వెదుళ్ళవలస గ్రామ పంచాయతీ నాయకులు ఈ రకంగా వ్యవహరించడం దారుణమన్నారు. చట్టపరమైన హక్కులేవీ వీరికి అమలు కావడం లేదన్నారు. వీరిని గ్రామీణ ఉపాధి పనికి కూడా రానివ్వడం లేదని, వెంటనే కార్డులు ఇచ్చి పని కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి 9-15 నెలల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బస్సు ఢీకొని బిటెక్ విద్యార్థి మృతి

మృతిచెందిన ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విటి అగ్రహారం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం ఆర్‌టిసి బస్సు ఢీకొని బిటెక్ చదువుతున్న విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. డెంకాడ మండలం బొడ్డవలస పంచాయతీ గద్దవానిపాలేనికి చెందిన కోరాడ ప్రేమ్‌కుమార్(20) తన చెల్లె హర్షితను తీసుకొని ద్విచక్ర వాహనంపై నగరంలోకి వస్తున్నాడు. విటి అగ్రహారం గాంధీనగర్ వద్ద వెనుక నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు వారిని ఢీకొనడంతో బస్సు చక్రం ప్రేమ్‌కుమార్ తలపైనుంచి వెళ్లిపోయింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న సోదరికి స్వల్ప గాయాలయ్యాయి. ఆమెను జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. రూరల్ ఎస్ఐ బి.గణేష్ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించారు. కుమారుడు మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. సంఘటనా స్థలాన్ని ఆర్‌టిసి డిఎం జె.శ్రీనివాసరావు, సిటిఐ దుర్యోధనుడు, ఆర్ హెచ్‌సి రవికుమార్, ఆర్టీసీ పోలీస్ సిబ్బంది పి.రవికుమార్, తదితరులు పరిశీలించారు.

స్పందనకు 156 వినతులు

అసంతృప్తి వినతుల సంఖ్య తగ్గాలి : కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

జగనన్నకు చెపుదాం, స్పందనకు వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు సంయుక్తంగా చర్చించుకుని పరిష్కరించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. దరఖాస్తులు పూర్తిగా పరిశీలించిన తర్వాతనే సమాధానాలు ఇవ్వాలని అన్నారు. స్పందన అనంతరం అసంతప్తి దరఖాస్తులపై శాఖల వారీగా సమీక్షించారు. అసంతృప్తి దరఖాస్తుల సంఖ్య తగ్గాలన్నారు.

సోమవారం స్పందన వినతులను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, సహాయ కలెక్టర్, త్రివినాగ్, ఆర్‌డిఒ సూర్యకళ, డిఆర్ఒ గణపతిరావు, డిప్యూటీ కలెక్టర్లు పద్మలత, సుదర్శన దొర, సూర్యనారాయణ ు స్వీకరించారు.

సమస్యలు వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

'స్పందన' ఫిర్యాదులపై తక్షణ చర్యలు : ఎస్‌పి

జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఎస్‌పి ఎం.దీపిక, అదనపు ఎస్‌పి అస్మా ఫర్వీన్ వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను అడిగి తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. వినతులు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం లో ఎస్‌సి, ఎస్‌టి సెల్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె.మురళి, ఎస్‌బి సిఐ జి.రాంబాబు, డిసిఆర్‌బి ఎస్ఐ వాసుదేవ్ పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో సోంపురం కూడలి నుంచి ఆనందపురం జంక్షన్ వరకు చేపడుతున్న రోడ్డు పనులను సోమవారం ఆర్‌అండ్‌బి క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. రోడ్డు నాణ్యతను తనిఖీ చేశారు. ఇంతవరకు చేపట్టిన రోడ్డు పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు నివేదికను పంపునున్నట్లు క్వాలిటీ కంట్రోల్ అధికారులు తెలిపారు.

రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

మొక్క నాటుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-బొబ్బిలి

మొక్కలతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చుని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యాధికారి జి.శశిభూషణరావు, తదితరులు పాల్గొన్నారు.మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎస్ఐబి సిఐ జైభీమ్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తిక్ కోరారు. ఎస్ఐబి స్టేషన్ ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ, నాటే కార్యక్రమాన్ని రోటరీ అధ్యక్షులు జెసి రాజు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు ప్రాజెక్ట్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు, చంద్రకిశోర్, ఎస్ఐ బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రిన్సిపల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపల్

ప్రజాశక్తి-వేపాడ

బక్కునాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం ప్రిన్సిపల్‌గా టి.ఎం.ఫ్లోరెన్స్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న యు.ఉషారాణి.. వైస్ ప్రిన్సిపల్‌గా కొనసాగుతారు. ఇదే గురుకులంలో 2008-2013 మధ్య పనిచేశానని ప్రిన్సిపల్ తెలిపారు. గురుకులంలో మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానన్నారు.

స్పందించారు.. సరిచేశారు

వేపాడ : మండలంలోని గుడివాడ గ్రామంలో పగటిపూట విద్యుత్తు దీపాలు వెలుగుతుండటంపై 'పగలే వెన్నెల' అనే కథనం సోమవారం 'ప్రజాశక్తి'లో రావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. జెఎల్ఎం ఆ సమస్యను పరిష్కరించారు. విద్యుత్తు దుబారాను అరికట్టేందుకు జెఎల్ఎం కృషిచేయడంపై గ్రామస్తులు అభినందించారు.

పిడిఎస్ బియ్యం పట్టివేత

వేపాడ : అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని సిఎస్ డిటి ఆధ్వర్యాన సోమవారం స్వాధీనం చేసుకున్నారు. బొలెరో వాహనంలో 29.20 క్వింటాళ్లు, ఆటోలో 9.40 క్వింటాళ్లను తరలిస్తుండగా ముందస్తు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నారు. రవాణా చేస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు డిటి తెలిపారు.

బాల్యవివాహం నిలిపివేత

వేపాడ : మండలంలోని బానాది గ్రామంలో సోమవారం బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. గుడివాడ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికను బానాదికి చెందిన మేనమామకు ఇచ్చి వివాహం చేస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. దీంతో ఆ గ్రామానికి ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ సన్యాసినాయుడు, ఐసిడిఎస్ పిఒ, సూపర్‌వైజర్లు చేరుకున్నారు. ఇరు కుటుంబాల వారితో సమావేశమై, బాల్యవివాహం వల్ల కలిగే నష్టాలపై వివరించారు. 18 ఏళ్లు నిండాక వివాహం చేయాలని సూచించి, బాల్య వివాహం జరగకుండా నిలిపేశారు.

నాణ్యమైన వైద్య సేవలందించాలి : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని వైద్యులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం ఆసుపత్రి అభివృద్ధి సలహా కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని అన్నారు. విధులకు వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలన్నారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యులు, మత్తు డాక్టర్, జనరల్ ఫిజిషియన్ వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వైద్యులను నియమించాలని సలహా కమిటీ సభ్యులు సుబ్బారావు ఎమ్మెల్యేను కోరారు. వైద్యాధికారి జి.శశిభూషణరావు, సభ్యులు రాణి, వైద్యులు పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- మెంటాడ

పోస్టల్ పథకాలను గిరిజన ప్రాంతాల్లో నివశించే ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గజపతినగరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.సాయి కిషోర్ కోరారు. సోమవారం మెంటాడ సబ్‌పోస్టాఫీస్ పరిధిలోని రొంపల్లి పోస్టాఫీసులో పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. గిరిజనులకు ఆర్థిక అక్షరాస్యత కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో పోస్టల్ శాఖ ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సుకన్య సమృద్ధి యోజన, పొదుపు, బీమా పథకాలను వినియోగించుకోవాలని కోరారు. గ్రామస్తులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీని, గ్రామ సచివాలయాన్ని సందర్శించి అక్కడ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిరంజీవి, ఈశ్వరరావు, పోస్టల్ సిబ్బంది రేవంత్, రమణ, చంటి, దొర తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణకు వ్యతిరేకంగా రైతుల ధర్నా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విశాఖ-అరకు జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు భూసేకరణను వ్యతిరేకంగా ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. గ్రామసభలు ఏర్పాటు చేయకుండా సర్వే రాళ్లు పాతడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. భూమికి బదులు భూమి ఇస్తేనే భూసేకరణ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి అందించారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ డేగల అప్పలరాజు, రైతులు సూర్యం, ఎం.జోగినాయుడు, వేమలి మాధవరావు పాల్గొన్నారు.

చెరువులను సంరక్షించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

పర్యావరణ పరిరక్షణకు చెరువులను సంరక్షించాలని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి కోరారు. ఆక్రమణకు గురైన కోటి చెరువును సోమవారం జనసేన కార్యకర్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ బొబ్బిలిలో చెరువులు, బందలు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. కోటి చెరువు ఆక్రమణలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఎస్.గంగాధర్, నాయకులు శివకుమార్, సత్యనారాయణ, శివశంకర్, బొన్నాడ గణేష్, కిరణ్ కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌జిసి, ఆప్కాస్ట్

విజయనగరం టౌన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఎన్‌జిసి, ఆప్కాస్ట్ ఆధ్వర్యంలో ధర్మవరం జెడ్‌పి హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి,పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

ప్లాస్టిక్ వినియోగంతో మానవాళికి ముప్పు

ఐఐపిఇ ఫౌండర్ డైరెక్టర్ ప్రసాద్ • నగరంలో ర్యాలీ, అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మనిషి ఆధునిక జీవన శైలిలో వచ్చిన మార్పులు, ప్లాస్టిక్ వస్తువుల విచ్చలవిడి వినియోగంతో పర్యావరణంలో సమతుల్యత దెబ్బతిందని ఐఐపిఇ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ) ఫౌండర్ డైరెక్టర్, ఆంధ్రాయూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ వియస్ఆర్‌కె ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వస్తువుల విచ్చలవిడి వినియోగంతో మానవాళికి ముప్పు పొంచు ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ప్రాథమిక కర్తవ్యంగా భావించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ, జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతథిగా హాజరైన వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ సదస్సును ఉద్దేశించి మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరించారు.

నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న కాలుష్య నియంత్రణ మండలి, అటవీశాఖ అధికారులు, సిబ్బంది

మారిన జీవన విధానంలో ప్లాస్టిక్ వస్తువులు అత్యంత ముఖ్యమైనవిగా మారిపోయాయని, అవి లేకుండా ఏ పని చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అయితే ప్లాస్టిక్ వస్తువులను సక్రమమైన మార్గంలో వినియోగంచటం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చని హితవు పలికారు. ఒక్క రోజులో పరిస్థితులు మారిపోవని నిరంతరం బాధ్యతగా ఉంటూ పర్యావరణాన్ని రక్షించుకోవాలని హితవు పలికారు. సంబంధిత పోస్టర్లను, కరపత్రాలను విడుదల చేశారు.

ప్రపంచ పర్యవరణాన్ని పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి, అటవీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ స్థానిక కళాభారతి ఆడిటోరియం నుంచి బాలాజీ జంక్షన్, మయూరి జంక్షన్ల మీదుగా ఎత్తు బ్రిడ్జి వరకు అక్కడ నుంచి మరళా ప్రారంభమై జిల్లా పరిషత్ వరకు సాగింది. కళాజాత బందాలు నాటికలు ప్రదర్శించారు. కార్యక్రమాల్లో కాలుష్య నియంత్రణ మండలి విజయనగరం డివిజన్ ఇఇ టి. సుదర్శన్, అటవీ శాఖ అధికారి ఎస్. వెంకటేశ్, జెడ్‌పి సిఇఒ ఎం.అశోక్ కుమార్, డిసిహెచ్‌సి డాక్టర్ గౌరీశంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, వివిధ పరిశ్రమల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యాన...

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక వైద్యఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద ర్యాలీ నిర్వమించారు. డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ముందుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవాలని, ప్లాస్టిక్ రహిత వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవాలని, వాటి బదులు కాటన్‌తో తయారు చేసిన సంచులను మాత్రమే వాడాలని అన్నారు. కారక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, ఎన్‌సిడి పిఒ పి.రవికుమార్, డిఐఒ డాక్టర్ శృతి, డాక్టర్‌శైలజ, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

రాజాం : రెడ్ క్రాస్, తోటపల్లి ప్రాజెక్ట్ డివిజన్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంజనీరింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తోటపల్లి ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ డివిజన్ ఆవరణలో ఉన్న శ్రీరామ ఆలయ అవరణలో ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ రెడ్డి రామచంద్రరావు, రెడ్ క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్, ఉద్యోగులు మొక్కలు నాటారు. కార్యక్రమం యువజన అవార్డు గ్రహీత ,రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య కుమార్, పెంకి గౌరీశ్వరరావు, ఆర్నిపల్లి వెంకట నాయుడు, పండూరు వేణుగోపాల్, రెడ్డి అప్పలనాయుడు, కొవ్వాడ అప్పలనాయుడు, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నెల్లిమర్ల : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని నగర పంచాయతి ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నగర పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ నగర్ కాలనీలో రోడ్డుకు ఇరు వైపులా మొక్కలు నాటి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు భాద్యతగా అందరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో 14 వార్డు కౌన్సిలర్ జనా త్రివేణి, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జనా ప్రసాద్, కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్, నగర పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో మానవ మనుగడకు ముప్పు

ప్లాస్టిక్ వల్ల మానవ మనుగడకు ముప్పు ఏర్పడిందని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు అన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మరో పదేళ్లలో భూగోళ ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ పెరగవచ్చుని వాతావరణ మార్పులపై పరిశోధనలు చేస్తున్న ఐక్యరాజ్యసమితి 'ఇంటర్ గవర్నమెంట్ ప్యానెల్'(ఐపీసీసీ) పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్లు ప్రొఫెసర్ మురళీ, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, ఇన్చార్జి డీన్ డాక్టర్ సన్నీడయోల్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: మండలంలోని తిప్పలవలస, పతివాడ గ్రామాల్లో ఎంపిపి మహంతి కళ్యాణి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణం పై అందరికీ అవగాహన అవసరం అన్నారు. రానున్న దినాల్లో పర్యావరణం పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ మండల కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ఎంపిడిఒ రామారావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం: పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరు చేపట్టాలని ఎపిఎం రమణ అన్నారు మండల కేంద్రంలో వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు మహిళలంతా ప్రతిజ్ఞ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అప్పలనాయుడు, ఎఒ బంగారయ్య, పశువైద్యాధికారి రామరాజు, ఎపిఒ ఆదిబాబు, డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్ల : పలు గ్రామాలలో వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం నారాయణరావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు మాట్లడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాలు పరిశుభ్రత పాటిస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కలవచర్ల, పాలవలస గ్రామాలలో మహిళలతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మహిళలు వైకెపి సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి- డెంకాడ

డిఎస్‌టి, సెర్బ్ నిధులతో ఇసిఇ డిపార్ట్‌మెంట్ ద్వారా నిర్వహిస్తున్న ఆరు రోజుల వర్క్‌షాప్ ఎంవిజిఆర్‌లో సోమవారం ప్రారంభమైంది. ఇక్కడ ఆరు రోజులు పాటు 'డిజైన్ అండ్ సిములేషన్ ఆఫ్ మినియేచర్ యాంటెనా యూజింగ్ మెషీన్ లెర్నింగ్ ఫర్ ఐఒటి అప్లికేషన్స్' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. ఈ వర్క్‌షాప్‌ను గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సమీర్ సెంటర్ ఫర్ ఎలక్ట్రోమాగ్నెటిక్ ఎనిర్వాన్‌మెంటల్ ఎఫెక్ట్స్ సైంటిస్ట్, జి.ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ బండారు సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు సాంకేతిక విద్యలో అత్యంత ప్రాముఖ్యం అని వివరించారు. ఇందులో డిఎస్‌టి సహకారం అభినందనీయమని కొనియాడారు. కళాశాల ప్రధాన ఉపాధ్యాయులు, మాన్సస్ కరస్పాండెంట్ డాక్టర్ కెవియల్ రాజు మాట్లాడుతూ ఈసిఈ విభాగ అధ్యాపకులు, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ యం. సత్యనారాయణను అభినందిచారు. ఈ కార్యక్రమంలో ఈసిఈ విభాగాధిపతి డాక్టర్ మస్తాన్ వలీ, డాక్టర్ ఎం. సత్యనారాయణ, డీన్ డాక్టర్ ఆర్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ ఉజ్వల క్రాంతి ప్రభ, డాక్టర్ బి. శ్రీనివాస్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో సంతోషమే లక్ష్యం

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కొత్తవలస

నియోజకవర్గంలో ప్రతి కుటుంబమూ సంతోషంగా ఉండటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండలంలోని మంగళపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలు, ప్రభుత్వ విధానాలను వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తెలుసుకొని అక్కడికి అక్కడే సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, జెసిఎస్ ఇన్‌ఛార్జి బొంతల వెంకటరావు, వైస్ ఎంపిపి కర్రి శ్రీను, నాయకులు సర్పంచ్ దలాయి అప్పరాజు, లక్ష్మి, ఎంపిటిసి కోరుబిల్లి లక్ష్మి, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

విత్తనాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి- రేగిడి

ఖరీఫ్ వరి విత్తనాలకు రైతులు రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయ మండల అధికారి గిరడ మురళీకృష్ణ సూచించారు. ఈ మేరకు సోమవారం అంబఖండి గ్రామంలో సచివాలయ సిబ్బంది, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని గ్రామపంచాయతీల వారీగా రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు కావలసిన రైతులు ఏ రకం విత్తనాలు కావాలో రిజిస్ట్రేషన్ చేసుకోమన్నారు. రిజిస్ట్రేషన్ ప్రాప్తికే వరి విత్తనాలు అందిస్తామన్నారు. ఐదు ఎకరాల లోపు చిన్న, సన్నకారు రైతులు ముందుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఎంటియు 1121, ఎంటియు 7029 స్వర్ణ, బిపిటి 5204 సంబామసూరి, ఎంటియు 1224, ఎంటియు 1064 రకాలు వరి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకుంటే ముందుగా వరి విత్తనాలు తేగలుగుతామన్నారు. రిజిస్ట్రేషన్ లేని రైతులు వరి విత్తనాలు ఇవ్వలేమన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండు నిరుపేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి నుంచి రూ.4.40 లక్షల ఆర్థిక సాయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అందజేశారు. గాయత్రి నగర్‌కు చెందిన సిహెచ్ రామకృష్ణ, చిన్నారి దంపతుల కుమార్తె లక్ష్మీ శరణ్య (14) అనారోగ్య కారణంతో విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గత మార్చి నెలలో తుదిశ్వాస విడిచింది. చికిత్సకు ఆరోగ్యశ్రీ అందకపోవడం తో, ఆ కుటుంబం అప్పులు చేసి వైద్యం అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో వారు ఉప సభాపతి కోలగట్లను కలిసి తమ పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఆయన సిఎం సహాయ నిధికి ప్రతిపాదించారు. ఈ మేరకు రూ.1.40 లక్షల మొత్తం విడుదల కాగా, సంబంధిత చెక్కును సోమవారం తన నివాసం వద్ద రామకృష్ణ, చిన్నారి దంపతులకు కోలగట్ల అందజేశారు. మరో ఘటనకు సంబంధించి రామజోగిపేట గ్రామానికి చెందిన నక్క నరసయ్యమ్మ కుటుంబానికి రూ.3 లక్షల విలువైన చెక్కును అందించారు.

కొండరాజుపాలెంలో విషాదఛాయలు

ప్రజాశక్తి -భోగాపురం

విశాఖ గీతమ్ యూనివర్శిటీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతు చెందిన భార్యాభర్తల మృతదేహాలు సోమవారం గ్రామానికి చేరుకున్నాయి. దీంతో మృతుల స్వగ్రామం కొండరాజుపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. నూరేళ్లు కలిసి జీవించాల్సిన నిండు జీవితాలు రహదారి ప్రమాదం కలిసే మరణించడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ దంపతులకు మూడేళ్లు, 9 నెలలు చిన్నారులు ఉన్నారు. తల్లిదండ్రులిద్దరూ ఒకే ప్రమాదంలో మృతి చెందడంతో చిన్నారులు అనాథలు అయ్యారని గ్రామస్తుల రోదన మిన్నంటింది. భార్యాభర్తలిద్దరినీ ఒకే చితి పై పేర్చి దహన సంస్కారాలు చేయడం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలను కలచివేసింది.

బాధిత కుటుంబానికి పరామర్శ

వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహాల్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. చిన్నారులు అనాధలు అయ్యారని ఆదుకునే చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం అంత్యక్రియలు నిమత్తం రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు.



మృతి చెందిన దంపతులకు దహన సంస్కారం చేస్తున్న గ్రామస్తులు

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ జి. గిరిబాల సూచించారు. సోమవారం ఆమె మొయిద విజయరాంపురం, కొండగుంపాం, గరికిపేట గ్రామాలను సందర్శించి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులు, సచివాలయం నూతన భవనం, రైతు భరోసా కేంద్రం భవనాలు ఇతర అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొండగుంపాం, మొయిద సర్పంచుల పతివాడ అప్పన్న, అట్టాడ కృష్ణ, కార్యదర్శులు పి. కిరణ్, యడ్ల రమణ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అలసత్వం వద్దు

ప్రజాశక్తి -భోగాపురం

పెండింగ్ సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని ఎంపిడిఒ ఎస్. అప్పలనాయుడు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో శాఖలు వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. 7 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ బంగారయ్య, ఇఒపిఆర్‌డి సురేష్, ఎపిఒ ఆదిబాబు, ఎపిఎం రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బిజెపిని గద్దె దించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చేయి చేయి కలిపి బిజెపిని గద్దె దించాలని డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో చంద్రం పేట, తాళ్ల పూడి పేట గ్రామాల్లో హాత్ సే హాత్ జోడో అభియాన్ చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని అన్ని రంగాల్లో నష్ట పరిచి కార్మికులు, కర్షకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చి బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి అన్ని వర్గాల ప్రజలూ చేయి చేయి కలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కనకల పద్మనాభం, సూరిబాబు, రమణ అప్పలరెడ్డి, రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెల్లం రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

సేంద్రీయ బెల్లం తయారీ రైతులను ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదరరావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కోమటిపల్లిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా చెరకు సాగుచేసిన రైతులతో ఆయన మాట్లాడారు. టిటిడి నుంచి ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన చెరకు నుంచి తయారు చేసిన బెల్లాన్ని కొనుగోలు చేస్తారని అధికారులు చెప్పడంతో గ్రామంలో ఐదుగురు రైతులు 20 ఎకరాల్లో 30 టన్నుల బెల్లం తయారు చేశారని తెలిపారు. గత డిసెంబరులో కొనుగోలు చేస్తామని చెప్పారని, ఆర్నెల్లు గడుస్తున్నా ఇంకా కొనలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఇదే విషయాన్ని ఇటీవల బొబ్బిలి వచ్చిన మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని వాపోయారు. తక్షణమే అధికారులు స్పందించి టిటిడి వారితో మాట్లాడి రైతుల వద్ద ఉన్న బెల్లాన్ని కొనుగోలు చేయాలని కోరారు.



క్రీడాకారులను సన్మానిస్తున్న కౌన్సిలర్ ప్రసాద్ తదితరులు

క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

క్రీడాకారులను మరింత ప్రోత్సహించాలని నగర పంచాయతీ 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ కోరారు. ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన బైరెడ్డి రాజేశ్వరిని, కోచ్ చల్లా రాముని కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మహేశ్వరి దంపతులు సోమవారం నెల్లిమర్లలో తన స్వగృహం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజేశ్వరికి రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు. అంతక ముందు కాంస్య పతకం గ్రహీత బైరెడ్డి రాజేశ్వరికి ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ మన ప్రాంతానికి చెందిన పేదింటి ఆడబిడ్డ అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబర్చి పేరు తీసుకు వస్తున్న క్రీడాకారులను మరింత ప్రోత్సహించి వారు మరింత ముందుకు వెళ్ళడానికి సహయ సహకారాలు అందించాలని సూచించారు. క్రీడలు, విద్యకోసం తన వంతు సహాయ సహకారం అందిస్తానని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి వీధి, చండకవీధి, కీర్తి వీధి యువత పాల్గొన్నారు.

భూ సర్వేతో రైతులకు మేలు

ప్రజాశక్తి- రేగిడి

భూ సర్వేతో రైతులకు మేలు జరుగుతోందని తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి అన్నారు. ఈ మేరకు సోమవారం పారంపేటలో భూ సర్వేలో భాగంగా రైతులకు అవగాహన కల్పించారు. దశాబ్దాలనాటి భూ సమస్యలు రీ సర్వేతో నికరమైన భూ విస్తరణ తెలుసుకోవచ్చు అని తెలిపారు. భూ సర్వేకు రైతులు సహకరించాలన్నారు. రెవెన్యూ, సర్వే సిబ్బంది భూ సర్వేకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా బృందానికి పత్రాలు చూపించాలని కోరారు. ప్రతి రైతుకు భూ సర్వే వద్ద దగ్గర ఉండి సర్వే చేయించుకునే బాధ్యత ఉందని సూచించారు.. ఇంతవరకు అడంగల్‌లో ఒక రైతు పేరు ఉంటే, పాస్ పుస్తకంలో వేరొకరి రైతు పేరు ఉంటుందని దీనివల్ల రైతులకు సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఖచ్చితమైన భూ సర్వే చేసుకుంటే వాటి ద్వారా రైతులకు ప్రభుత్వ రాయితీలు, బ్యాంకుల నుంచి లోన్లు అవసరం మేరకు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి, ఇన్చార్జి డిటి శ్రీనివాసరావు, విఆర్‌ఒ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

పార్కులకు పూర్వవైభవం తీసుకురావాలి

ప్రజాశక్తి -విజయనగరం కోట

నగరంలోని పార్కులకు పూర్వవైభవం తీసుకురావాలని టిడిపి నాయకులు కోరారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి అందజేశారు. పార్కులకు మరమ్మత్తులు చేసి వాటిని పునరుద్ధరించి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అనంతరం కలెక్టర్ వద్ద టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కనకల మురళీమోహన్ ఇతర నాయకులు మాట్లాడుతూ నగరంలోని పలు పార్కులకు ఆనాటి నాయకుల పేర్లు పెట్టారని అన్నారు. గాంధీ, నెహ్రూ, ప్రకాశం పార్కులు శిథిలావస్థకు వచ్చాయన్నారు. నెహ్రూ పార్క్ మధ్యలో నుంచి రోడ్డు వేయడంతో అది కాయగూరలు అమ్ముకోవడానికి తప్ప మరెందుకు పనికి రాదన్నారు. ఇటీవల మహిళా పార్కును ప్రారంభించి, తరువాత రిపేరు బోర్డు పెట్టి మూసేశారని అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కార్యదర్శి బంగారు బాబు, మైలపల్లి పైడిరాజు, కోండ్రు శ్రీను, భరత్, రాజీనాయుడు, గొండేల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ప్రజాశక్తి-గజపతినగరం

రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా కల్పిస్తున్న పథకాలపై ఎఒ సిహెచ్.ధనలక్ష్మి ఆధ్వర్యంలో సీతారాంపురం ఆర్‌బికెలో సోమవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. పచ్చిరొట్ట ఎరువు వల్ల కలిగే ప్రయోజనాలు, విత్తనాల సబ్సిడీ వివరాలు, ఎరువుల అమ్మకం, ఇ-క్రాప్ నమోదు, క్రాప్ ఇన్సూరెన్స్, పొలంబడి మొదలైన వాటి గురించి వివరించారు. గ్రామస్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమావేశం కూడా నిర్వహించారు. ప్రస్తుతానికి పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు ఆర్‌బికెలో రిజిస్ట్రేషన్ చేసుకుని విత్తనాలు తీసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాల సాగు ద్వారా నేలలో సూక్ష్మజీవులు పెరిగి సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని చెప్పారు. తద్వారా నేల సారవంతంగా మారి పంటకు వేయవల్సిన ఎరువుల వినియోగం తగ్గి రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఆత్మ బిటిఎం ఉదయశ్రీ, సర్పంచ్ తుంపిల్లి పైడితల్లి, తుంపిల్లి జనార్దన్, దాసరి జగన్నాథం, రైతులు పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో గడపగడపకు..

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 27వ డివిజన్ పరిధిలోని జొన్న గుడ్డి, మజ్జి వీధి తదితర ప్రాంతాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పైన, పాలనపైన ప్రజాస్పందన అడిగి తెలుసుకున్నారు. సహాయ కమిషనర్ ప్రసాదరావు, కార్పొరేటర్ దుప్పాడ సునీత, దుప్పాడ అప్పారావు, పైడిరాజు పాల్గొన్నారు.